ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
మంగళవారం 6 ఆగస్టు 2024



బదిలీలు సరే.. భర్తీ ఏదీ?

బల్దియాకు తలనొప్పులు తెచ్చిన ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్లు

- సాధారణ బదిలీల్లో 70 మందికి స్థానచలనం
- ఆ ఖాళీలను భర్తీ చేయని ప్రభుత్వం
- పోస్టింగ్ ఇచ్చినా రిపోర్టు చేయని కొందరు
- ఫలితంగా సిబ్బందిపై పెరిగిన పనిభారం

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 5 : 'మూలిగే నక్కపై తాటి పండు పడిన' చందంగా ఉంది వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిస్థితి. చాలా ఏళ్ల తర్వాత జరిగిన ఉద్యోగుల సాధారణ బదిలీలు బల్దియాకు కొత్త తలనొప్పులు తెచ్చిపెట్టాయి. బదిలీలు మాత్రం పెద్ద ఎత్తున జరిగి.. అధికారులకు స్థానచలనం కాగా.. వారి స్థానాలను భర్తీ చేసేవారు మాత్రం ఇక్కడికి రావడం లేదు. దీంతో ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతోంది.


రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 80 ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ విభాగాల్లో సాధారణ బదిలీల ప్రక్రియను నిర్వహించింది. ఒకే స్థానంలో మూడేళ్ల కంటే ఎక్కువకాలం పని చేసిన సిబ్బందిని గుర్తించి స్థానచలనం కల్పించారు. ఈ క్రమంలో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని బల్దియా ప్రధాన కార్యాలయంతో పాటు కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు స్థాన చలనం జరిగింది. గత నెల 20వతేదీ వరకు బల్దియాలో పనిచేస్తున్న 70 మంది నాలుగో తరగతి నుంచి గెజిటెడ్ ఎస్ఈ, సిటీప్లానర్ వరకు బదిలీల ప్రక్రియ జరిగింది. కొందరికి ఆర్‌డీఎంఏ పరిధిలో బదిలీలు నిర్వహించగా, మరి కొందరు అధికారులకు ప్రభుత్వం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే బదిలీ చేసిన వారి స్థానాల్లో రెండు, మూడు స్థానాల్లో ఉద్యోగులను నియమిస్తూ పోస్టింగ్ ఇచ్చినా ఇంత వరకు వచ్చి రిపోర్టు చేయలేదు. కొందరు ఇక్కడకు వచ్చేందుకు మీమాంసలో ఉండగా, మరికొందరు రావడానికి వెనకాడుతున్నట్టు తెలిసింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో పనులు నిలిచిపోకుండా ఉండేందుకు ఎస్ఈ కృష్ణారెడ్డి స్థానంలో అదే విభాగంలో పని చేసే ఈఈ రాజయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించగా.. సిటీ ప్లానర్ వెంకన్న స్థానంలో ఎంశైలజకు పోస్టింగ్ ఇచ్చారు. కానీ ఇంకా విధుల్లో చేరలేదు. శానిటేషన్‌లో ఎస్ఐలకు అదనపు బాధ్యతలు అప్పగించగా తల మునకలవుతున్నారు. అదే విధంగా టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగంలో ఆరుగురు బదిలీ కాగా, ఇంకా విధుల నుంచి రిలీవ్ కాకుండా ఒక్క ఆశతో బదిలీలో మార్పు చేసుకునేందుకు కొందరు అధికారులు, ప్రజాప్రతినిధుల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

సిబ్బందిపై అధిక పని భారం

బల్దియా పరిధిలో శానిటేషన్ విభాగంలో పనిచేసే సిబ్బందితో పాటు కాలనీల వారిగా పనిచేసే ప్రభుత్వ, దినసరి కార్మికులు ఇప్పటికే ఉండవలసిన సిబ్బంది కంటే చాలా తక్కువగా ఉన్నారు. జనాభా నిష్పత్తి పెరిగిన కొద్దీ సిబ్బందిని పెంచాల్సి ఉండగా, తక్కువ సిబ్బందితో కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో శానిటేషన్ విభాగం నుంచి 50 మంది సిబ్బందిని బదిలీ చేయడం వారి స్థానాల్లో ఇంకా ఎవరినీ నియమించకపోవడంతో ఉన్న సిబ్బందికి పనిభారంగా మారుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా టౌన్ ప్లానింగ్‌లో భవన నిర్మాణ అనుమతులు ఇవ్వాల్సిన సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించపోవడం వల్ల పనులు స్తంభించి పోయారు. అరకొర ఇంజనీరింగ్ సిబ్బంది ఉండడంవల్ల రోడ్లు, డ్రెయినేజీలు, తదితర అభివృద్ధి పనులు నిలిచి పోతున్నాయి. అదేవిధంగా ప్రజలకు సమయానికి తాగునీటి సరఫరా చేయాల్సిన ఫిల్టర్ బెడ్ల సిబ్బంది, అధికారులు తక్కువగా ఉండడంతో తాగునీరు ప్రజలకు అందకుండా పోతోంది. వరంగల్ ట్రైసిటీలో ముగ్గురు మెడికల్ ఆఫీసర్లు(ఎంహెచ్‌వో)లు ఉండాల్సింది పోయి.. ఒక్కరే పని చేస్తుండడంతో తలకు మించిన భారంగా మారింది. ఇంకా బాలసముద్రంలోని బల్దియా వాహనాల రిపేరు షెడ్డుకు వచ్చిన వాహనాలు ఈఈతో పాటు డీఈ అంబుబాటులో లేకపోవడంతో చిన్నపాటి రిపేరుకు వస్తే నెలల తరబడి షెడ్డులోనే ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. అలాగే బల్దియా సమాచార విభాగంలో పనిచేసే ఓ ఉద్యోగి.. అటు కలెక్టర్ కార్యాలయంలో ఇటు బల్దియాలో పనిచేస్తూ భారంతో సతమతమవుతున్నట్లు తెలిసింది. అధికారులు, ప్రభుత్వం స్పందించి బల్దియాకు వెంటనే సిబ్బందిని భర్తీ చేస్తే అదనపు బాధ్యతలు నిర్వర్తించే సిబ్బంది, అధికారులకు కొంత ఉప శమనంగా కలుగుతుందని ఉద్యోగులు భావిస్తున్నారు.

70మంది సిబ్బంది బదిలీ..

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో ఇటీవల అన్ని విభాగాలను కలుపుకొని 70 మంది వరకు ఉద్యోగులు, అధికారులు బదిలీ అయ్యారు. ఒక సీనియర్ అసిస్టెంట్, పది మంది వార్డు ఆఫీసర్లు, ఒక శానిటరీ సూపర్‌వైజర్, నలుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎనిమిది మంది హెల్త్ అసిస్టెంట్లు, ముగ్గురు శానిటరీ జవాన్లు, ఆరుగురు అటెండర్లు, ఒక లైన్‌మెన్, ఒక వాచ్‌మెన్, ఇద్దరు పంప్ ఆపరేటర్లు, 13మంది పబ్లిక్ హెల్త్ (పీహెచ్)వర్కర్లు, వీరితో పాటు ఒక సిటీ ప్లానర్, నలుగురు టీపీపీవోలు, ఒక ఎస్ఈ, ఒక ఈఈ, ముగ్గురు డీఈలు, ముగ్గురు బర్త్ అండ్ డెత్ విభాగం అధికారులు, ముగ్గురు పరిపాలనా విభాగం, నలుగురు క్లర్కులు బదిలీ అయ్యారు. మొత్తంగా బల్దియా నుంచి ఖమ్మం, మహబూబాబాద్, పరకాల, భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతాల మున్సిపల్ కార్పొరేషన్‌లకు సుమారు 70మంది బదిలీ అయ్యారు. కొందరు ఇక్కడి నుంచి నిష్క్రమించగా, ఇంకా కొందరు స్థానచలనం కాకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంకా కొందరు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లి రిపోర్టు చేసిన తర్వాత తిరిగి బల్దియాకు డిప్యూటేషన్ వచ్చేందుకు, లేదంటే ఒకరికి బదులు మరొకరు అనే అవకాశం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.





జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభిస్తున్న ఎంపీ కడియం కావ్య

వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి మరింత కృషి

'శ్రావణ' వేడుకలను ప్రారంభించిన ఎంపీ కడియం కావ్య

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 5: నగరంలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయ అభివృద్ధికి మరింత కృషిచేస్తానని ఎంపీ కడియం కావ్య చెప్పారు. శ్రావణమాసం సందర్భంగా వేయిస్తంభాల ఆలయంలో నెలరోజులపాటు జరిగే వేడుకలను ఆమె శివుడికి ప్రీతికరమైన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంపీగా తొలిసారి ఆలయాన్ని సందర్శించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కల్యాణమండపాన్ని పరిశీలించి.. మిలిగిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న గార్డెన్‌కు అవసరమైతే ఎంపీ నిధులను కేటాయిస్తానని చెప్పారు. ఆలయ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలపై డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్టు సమర్పించాలని పురావస్తు శాఖ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఇతర అర్చకులు ఆమెతో రుద్రేశ్వరుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి శేషవస్త్రాలు బహూకరించారు. సీపీ అంబర్ కిశోర్ ఝా కూడా ఎంపీ వెంట వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం సుప్రభాత సేవ, మంగళవాయిద్య సేవ అనంతరం ఉత్తిష్ట గణపతికి హరిద్రా కుంకుమ లేపనంతో అఘోర పాశుపద మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహింపజేశారు. 200 మంది దంపతులతో సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 51 కిలోల పెరుగన్నంతో అన్నసూక్త మంత్ర పఠనంతో అపమృత్యు రుద్రుడిగా అలంకరింపజేసి భక్తుల దర్శనానికి అనుమతించారు. శివ భక్తుడు మామిడాల గణపతి దంపతులు మహాన్నదానం నిర్వహించారు. మణి కంఠశర్మ, సందీప్‌శర్మ, ప్రణవ్‌శర్మలతోపాటు ఆలయ ఈవో వెంకటయ్య వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక కార్పొరేటర్ తోట వెంకన్న, బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి, హనుమకొండ సీఐ సంతోష్ తదితరులు కూడా పాల్గొన్నారు.



పత్రాలను పరిశీలిస్తున్న సబ్ రిజిస్ట్రార్ సైదులు



సబ్‌రిజిస్ట్రార్ నరేంద్రకు అభినందనలు తెలుపుతున్న న్యాయవాదులు

బాధ్యతలు స్వీకరించిన సబ్ రిజిస్ట్రార్లు

ఆటోనగర్, ఆగస్టు 5: ఇటీవల జరిగిన గ్రేడ్-2, జోన్ -4 విభాగంలోని మల్టీజోన్-1 సబ్ రిజిస్ట్రార్ల బదిలీల్లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న భూక్యా సైదులు వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీపై వచ్చారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. రెండేళ్లపాటు సబ్ రిజిస్ట్రార్‌గా కొనసాగనున్నారు.

- కరీమాబాద్: ఉర్సు బైపాస్‌రోడ్డులోని ఫోర్ట్ వరంగల్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బదిలీపై వచ్చిన సబ్ రిజిస్ట్రార్‌గా జి.నరేంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు కార్యాలయంలో న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శామంతుల శ్రీనివాస్, మెరుగు సుభాష్, ఓం ప్రకాష్, ఓదెల నర్సింగం, ప్రభాకర్, పూస రవీందర్ ఉన్నారు.

ఆపరేషన్ కరెంట్ పోల్

- విద్యుత్ శాఖలో కొత్త ఒరవడి
- ముమ్మరంగా విద్యుత్ స్తంభాలు, లైన్ల మరమ్మతులు

7



అభివృద్ధి పనులపై మాట్లాడుతున్న మంత్రి సురేఖ

నిర్దేశిత గడువులోగా అభివృద్ధి పనులను పూర్తిచేయండి

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- నగరాభివృద్ధిపై అధికారులతో సమావేశం

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 5: గ్రేటర్ వరంగల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. సోమవారం 'స్వచ్ఛదనం.. పచ్చదనం..' కార్యక్రమాల అనంతరం సాయంత్రం హనుమకొండ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బల్దియా, కుడా, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సాధారణ నిధు లు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, స్మార్ట్ సిటీ మిషన్ కింద 15వ ఫైనాన్స్ తదితర అంశాలపై సమీక్షించారు. అభివృద్ధి పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ.. ప్రస్తుతం కొనసాగుతున్న పనులలో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. మిగిలిన పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. స్మార్ట్‌సిటీ మిషన్ కింద భద్రకాళి బండ్, వడ్డెపల్లి బండ్ అభివృద్ధి పనులతో పాటు 4 స్టేడియాలు, రంగసముద్రం బండ్ సుందరీకరణ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. కుడా ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు ఆర్టీవో ఆఫీస్ ఖమ్మం రోడ్డు నుంచి ఆరెపల్లి వరకు 13 కిలోమీటర్ల ఇన్నర్ రింగు రోడ్డు పనులు కొనసాగుతున్నాయని, త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఇంకా కాళోజీ కళాక్షేత్రం పనులు ఇప్పటివరకు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు సెప్టెంబరు 9లోగా పూర్తి చేయాలని చెప్పారు. వనమహోత్సవంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు రూ.11.69కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇందులో హనుమకొండ జిల్లాకు రూ.5.60కోట్లు కేటాయించారని చెప్పారు. సెప్టెంబరు 9న సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, బల్దియా ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, సిటీ ప్లానర్ శైలజ, హనుమకొండ ఆర్డీవో రమేష్, కుడా పీవో అజిత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం.. పచ్చదనం'లో భాగస్వాములు కావాలి

- రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- బల్దియా పరిధిలో మొక్కలు నాటిన ప్రముఖులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'స్వచ్ఛదనం.. పచ్చదనం..' కార్యక్రమంలో ప్రజలు, ప్రభుత్వ అధికారులు భాగస్వాములు కావాలని రాష్ట్ర అటవీ పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. 'స్వచ్ఛదనం.. పచ్చదనం..' కార్యక్రమాన్ని సోమవారం బల్దియా కార్యాలయ ఆవరణలో మంత్రి సురేఖ, ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలు లాంఛనంగా ప్రారంభించారు. బల్దియాలో శ్రమదానం చేస్తూ చీపుర్లతో పరిసరాలను శుభ్రం చేశారు. తర్వాత సంయుక్తంగా జెండా ఊపి శాంతి ర్యాలీని ప్రారంభించారు. బల్దియా నుంచి కేఎంసీ వరకు ఈ ర్యాలీ పండగ వాతావరణంలో సాగింది.



మాట్లాడుతున్న మంత్రి సురేఖ



బల్దియా ఆవరణలో పరిసరాలను శుభ్రం చేస్తున్న మంత్రి సురేఖ, ఎంపీ కావ్య, కలెక్టర్లు, అధికారులు

ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. కరోనా ముగిసిన తర్వాత వయసుతో సంబంధం లేని వ్యాధులు వస్తున్నాయని, కొన్ని సందర్భాల్లో మరణాలు కూడా సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహారం, పరిసరాల విషయంలో అందరికీ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా వాతావరణంలో కాలుష్యం వల్ల డెంగీ, చికెన్ గున్యా, మలేరియా జ్వరాలు సోకి చాలామంది పేదలు ఆస్పత్రుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు జబ్బులు రాకుండా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రతతో పాటు పచ్చని చెట్లను పెంచాలని సూచించారు. ఇంకా ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఐదు రోజులుగా జరిగే స్వచ్ఛదనం.. పచ్చదనం.. కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ మాట్లాడుతూ.. ప్రధానంగా పల్లెలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండడం కోసమే సీఎం ప్రత్యేక చొరవతో ఐదు రోజుల కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. బల్దియాలో మంత్రి చేతుల మీదుగా తొలిసారిగా మొక్కలు నాటడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, ఇన్‌చార్జి ఏసీ కృష్ణారెడ్డి, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, సిటీప్లానర్ ఎంశైలజ, ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, బయాలజిస్ట్ మాధవరెడ్డి, హెచ్‌వో రమేష్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, టీపీఆర్‌వో కోల రాజేశ్‌లు పాల్గొన్నారు.

20లోపు కళాక్షేత్రం పనులు పూర్తి చేయాలి

- పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్

బాలసముద్రం, ఆగస్టు 5: బాలసముద్రంలో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు ఆగస్టు 20లోపు పూర్తి చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ నిర్మాణ సంస్థల ప్రతినిధుల ను ఆదేశించారు. సోమవారం మే యర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, కలె క్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిష నర్ అశ్విని తానాజీవాకడే అధికారులతో కలిసి కాళోజీ కళాక్షేత్రంలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ మాట్లాడుతూ.. ఆగస్టు 20లోపు పనులు పూర్తి చేయాలన్నారు. కళాక్షేత్రంలో ఏఏ పనులు ఎప్పటివరకు పూర్తి చేస్తారో నిర్మాణసంస్థ ప్రతినిధులు ఎప్పటికప్పుడు తెలియజేయాలని అన్నారు. అదనంగా పనివారిని నియమించి షిఫ్టుల వారీగా పని చేయించాలని అధికారులను, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ఆదేశించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. బాల్కనీ, సీటింగులపై నిర్మాణ సంస్థ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులను ప్రతీరోజు తనిఖీ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కళాక్షేత్రం నిర్మాణపనులు పరిశీలిస్తున్న పురపాలక ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, అధికారులు

అభివృద్ధి పనుల కొనసాగింపునకు ఆమోదం

వరంగల్ నగరంలో జరుగుతున్న స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ అభివృద్ధి పనులు కొనసాగించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ అన్నారు. సోమవారం కుడా కార్యాలయంలో 27వ స్మార్ట్‌సిటీ బోర్డు నిర్వహించారు. ఈ బోర్డు సమావేశంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ఇంజనీర్ ఇన్ చీఫ్ జియాఉద్దీన్, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, బల్ది యా కమిషనర్, కుడా వీసీ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్లు సం ధ్యారాణి, వెంకట్‌రెడ్డిలు పాల్గొన్నారు.

వరంగల్ నగరంలో జరుగుతున్న పనుల వివరాలను దానకిశోర్ అడిగి తెలుసుకున్నారు. స్మార్ట్‌సిటీ పథకం ఎజెండాలో రూపొందించిన బయో మైనిగ్, స్మార్ట్‌సిటీ ఫేజ్ 1, 2 పనులు, నాలాల పునరుద్ధరణ, రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, దసరా రోడ్డు, గవిచర్ల రోడ్డు, వడ్డెపల్లి బండ్, భద్రకాళీ బండ్ జోన్, నయీంనగర్ హైవే లెవల్ బ్రిడ్జీ పనులు జరుగుతున్నాయని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. ఇక్కడ జరుగుతున్న పనులకు 2025 వరకు బోర్డు ఆమోదం తెలిపిందని చెప్పారు. గతంలో మంజూరు చేసిన 4 అభివృద్ధి పనులను రద్దుచేస్తూ వాటి స్థానంలో మరో నాలుగు పనులకు ప్రతిపాదనలు జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో కుడా సీపీవో అజీత్‌రెడ్డి, బల్దియా ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, ఈఈ శ్రీనివాస్‌రావు, స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆనంద్ ఓలేటీ పాల్గొన్నారు.



మహబూబాబాద్ రోడ్డులోని ప్రభుత్వ భూమి

ప్రభుత్వ భూమిపై కన్ను

- కోట్ల విలువ చేసే స్థలం కాజేసేందుకు కుట్ర
- రియల్టర్లతో అధికారుల కుమ్మక్కు
- మోఖాపై వెళ్లకుండానే నిర్మాణాలకు అనుమతులు
- నర్సంపేట అధికారుల తీరుపై ఆగ్రహం

నర్సంపేట టౌన్, ఆగస్టు 5: కోట్ల రూపాయల విలువైన సర్కారు భూమిపై రియల్టర్ల కన్నుపడింది. అందికాడికి కబ్జా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. రియల్టర్లకు కొందరు అధికారులు కొమ్ముకాస్తూ.. విలువైన భూమిని ధారాదత్తం చేసేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. నర్సంపేట పట్టణంలో ఎన్నో పోరాటాల ఫలితంగా దళితులు దక్కించుకున్న సర్వే నెంబర్ 121లోని ప్రభుత్వ భూమి తమదేనంటూ ఇటీవల కొందరు రియల్టర్లు ముందుకు వస్తుండడంతో భూవివాదానికి తెరలేసింది. పట్టణంలోని ప్రభుత్వ భూములను, గ్రీన్‌ల్యాండ్ స్థలాలు, సాగునీటి కాల్వలను సైతం వదలకుండా రియల్టర్లు, రాజకీయ నాయకులు కబ్జాచేసి అక్రమ వెంచర్లతో ప్లాట్లు చేసి కోట్లు దండుకున్నారు. పట్టణంలోని మహబూబాబాద్ రోడ్డులో సర్వే నెంబర్ 121 ప్రభుత్వ భూమిలో 4 ఎకరాల ఆరు గుంటల భూమి ఉంది. ఇందులో మూడెకరాలు ఇండ్లు, రోడ్లకు పోగా ఎకరం ఆరు గుంటల ఉంది. ఈ స్థలాన్ని 2011లో అప్పటి కలెక్టర్ వాకాటి కరుణ ఆదేశాల మేరకు సర్వే చేయించి ప్రభుత్వ భూమిగా గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. అంబేద్కర్ భవన నిర్మాణం కోసం టెండర్ సైతం వేశారు. అయితే భవన నిర్మాణం కోసం భూమిని అప్పగించాలని కోరుతూ మునిసిపాలిటీ అధికారులు, రెవెన్యూ అధికారులకు రెండేళ్ల క్రితమే లేఖను అందించారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం రూ.4 కోట్లకు పైగా విలువ చేసే ఈ స్థలాన్ని కొంత మంది రియల్టర్లు కబ్జా చేసేందుకు అధికారులతో కుమ్మక్కై కుట్ర పన్నుతున్నారని దళిత సంఘాలు ఆరోపిస్తున్నాయి. కాగా, 2011లోనే ప్రభుత్వ భూమిగా గుర్తించగా, దానిని పరిరక్షించుకోవడానికి దళిత సంఘాలు కొద్ది రోజుల నుంచి ఆందోళనలు చేస్తున్నాయి.



ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని తహసీల్దార్‌ను కోరుతున్న సంఘాల నాయకులు

మోఖాపై వెళ్లకుండానే నిర్మాణాలకు అనుమతులు..


రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా ఉన్న 121సర్వే నంబర్ భూమిని చూపిస్తూ పత్రాలపై సర్వే నెంబర్ 129గా పేర్కొంటూ రియల్టర్లు మునిసిపల్ అధికారులకు నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. రియల్టర్లు దరఖాస్తు చేసుకున్న భూమి ప్రభుత్వ భూమినా, ప్రైవేట్ భూమినా అని మోఖాపై వెళ్లి పరిశీలించిన తర్వాతనే అనుమతులు ఇవ్వాల్సి ఉంది. కానీ, ఇందుకు విరుద్ధంగా అధికారులు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.



రెండు రోజులపాటు కోమటిపల్లి రైల్వే గేటు మూసివేత

కాజీపేట, ఆగస్టు 5 కాజీపేట - హసన్‌పర్తి రైల్వే స్టేషన్ మధ్య ఉన్న కోమటిపల్లి రైల్వే గేటును మంగళవారం, బుధవారం రెండు రోజులపాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే ట్రాక్ పనుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ మార్గం మీదుగా ప్రయాణించే వారు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.








నర్సరీలో మొక్కను నాటుతున్న జంగా రాఘవరెడ్డి

ఆయిల్‌పామ్ సాగు పెంపుపై దృష్టి


తెలంగాణ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

జనగామ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును మరింతగా పెంచేందుకు ప్రభుత్వం సారించిందని తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. జనగామ మండలం ఎల్లంల శివారులో ఉన్న ఆయిల్‌పామ్ నర్సరీని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జంగా మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతుల కు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు ఆర్థికంగా బలపడే అవకాశం ఉన్నందున రైతులు ఈ సాగుపై మొగ్గుచూపాలన్నారు. సాగుకు నాణ్యమైన మొక్కలను అందించేందుకు గానూ నర్సరీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు పెంపునకు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. వన మహోత్సవంలో భాగంగా నర్సరీలో జంగా మొక్కను నాటారు. ఆయన వెంట జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్ రావు, అధికారులు రవికాంత్, రామకృష్ణ, రవళి, ఫీల్డ్ ఆఫీసర్లు ఉన్నారు.




















ఇంటర్ విద్యార్థి అదృశ్యం

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 5: మండలంలోని శివునిపల్లి గ్రామానికి ఎస్. యశ్వంత్‌రెడ్డి అనే ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. విద్యార్థి తల్లిదండ్రు లు మహేశ్వరి - అమరేందర్‌రెడ్డి తెలిపిన వివరా లు ఇలా ఉన్నాయి. యశ్వంత్‌రెడ్డి 2023-24 విద్యా సంవత్సరంలో డివిజన్ కేంద్రంలోని హోళీక్రాస్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ హనుమకొండలోని ఓ ప్రయివేటు కళాశాలలో బైపీసీ గ్రూపులో చేరి హస్టల్‌లో ఉండి చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం యశ్వంత్‌రెడ్డి తల్లిదండ్రులతో ఫోన్‌లో బాగానే మాట్లాడాడని తెలిపారు. సోమవారం తెల్లవారుజామున హస్టల్ వార్డెన్ విద్యార్థులను నిద్రలేపే క్రమంలో యశ్వంత్‌రెడ్డి కనిపించలేదు. వార్డెన్ ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇవ్వగా.. ప్రిన్సిపాల్ విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. వెంటనే తల్లిదండ్రులు బంధువలకు, తెలిసినవారికి ఫోన్ చేసి అడిగి పలువురి ఇళ్ల వద్దకు వెళ్లి వెతికినప్పటికీ యశ్వంత్‌రెడ్డి జాడ దొరకలేదు. దీంతో సోమవారం సాయంత్రం తల్లిదండ్రులు హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థి మిస్సింగ్ పై ఫిర్యాదు చేశారు. తమ కుమారుడి అచూకీ తెలుసుకొని అప్పగించాలని పోలీసులను వేడుకున్నారు. ఎవరికైనా అచూకీ తెలిస్తే 8897224045, 9866509162, 9704618147 నెంబర్లలో సమాచారం అందించాలని వేడుకున్నారు.

గర్భిణీపై దాడి.. గర్భస్థ శిశువు మృతి

పోలీసులను ఆశ్రయించిన మహిళ భర్త

మడికొండ, ఆగస్టు 5: నిండు గర్భిణీ పై కొందరు వ్యక్తులు దాడి చేయడంతో సదరు మహిళ గాయపడి గర్భంలో ఉన్న శిశువు మృతి చెందిందని అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ బాధిత మహిళ భర్త పోలీసులను ఆశ్రయించాడు. మడికొండ ఇన్‌స్పెక్టర్ డి.ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు.. ధర్మసాగర్ మండలం శాయిపేటకు చెందిన చేపూరి శ్రీధర్ కాజీపేట మండలం రాంపేటకు చెందిన అనూషను కొన్నేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. కొంతకాలం కాపురం చేసిన తర్వాత కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలం ఆముదాలపల్లికి చెందిన మెదుదల అమిత అనే మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమార్తె ఉంది. కాగా, కొంతకాలంగా శ్రీధర్ తిరిగి తన మొదటి భార్య అయిన అనూషతో కలిసి ఉంటూ తన రెండో భార్య వద్దకు వెళ్లడంలేదు. ఈక్రమంలోనే మొదటి భార్య గర్భం దాల్చింది. ఆమె తన తల్లిగారింటి వద్ద ఉండగా నిండు గర్భిణీగా ఉన్న భార్య అనూషను ఆస్పత్రికి తీసుకెళ్ళడానికి శ్రీధర్ రాంపేటకు చేరుకున్నాడు. ఆదివారం తన రెండో భార్య అమిత.. మరికొందరితో కలిసి రాంపేటకు చేరుకొని తన భర్త శ్రీధర్, అతడి మొదటి భార్య అనూషపై దాడి చేశారు. దీంతో గాయపడిన అనూషను ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు ఆపరేషన్ చేసి శిశువును బయటికి తీసి గర్భంలోనే చనిపోయిందని తెలిపారు. దీంతో తన భార్యపై దాడి చేసి గర్భంలో ఉన్న శిశువు మృతికి కారణమైన వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని సోమవారం శ్రీధర్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మెడికల్ ప్రవేశాల్లో ఎన్‌సీసీ కోటా టెన్షన్

2023-24నుంచి ఎన్‌సీసీ విద్యార్థులకు మెడికల్ సీట్లలో వాటా కట్ ● ఈ మెడికల్ కౌన్సెలింగ్‌కైనా కోటా అమలు చేయాలని విద్యార్థుల విజ్ఞప్తి



(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మెడికల్ కోర్సుల్లో ఎన్‌సీసీ కోటాపై విద్యార్థుల్లో టెన్షన్ నెలకొంది. త్వరలోనే మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలను చేపట్టేందుకు వరంగల్ కాళోజీ హెల్త్ యూనివర్సిటీ కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం రద్దు చేసిన ఎన్‌సీసీ కోటాను కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరిస్తుం దా? లేదా? అనే ఉత్కంఠలో విద్యార్థులున్నారు. రాష్ట్రం లో 5జూలై 2017లో జీవో నెం.114ద్వారా మెడికల్ కోర్సులైన ఎంబీబీఎస్, బీడీఎస్‌ల్లో ఎన్‌సీసీ పూర్తి చేసిన విద్యార్థులకు 1శాతం రిజర్వేషన్‌ను అమలు చేశారు. ఇంటర్మీడియేట్ కంటే ముందు ఎన్‌సీసీలో ఏ, బీ, సీ సర్టిఫికెట్లతో పాటు 75శాతం ఎన్‌సీసీ తరగతులకు హాజరైన వారికి మెరిట్ ఆధారంగా మెడికల్ ప్రవేశాల్లో రిజర్వేషన్ కల్పించారు. కన్వీనర్ కోటాలో ఉన్న సీట్లలో ఎన్‌సీసీ విద్యార్థులకు మెడికల్ సీటు లభించేది. ప్రతి ఏటా మెడికల్ సీట్ల ఆధారంగా 50 నుంచి 60మంది వరకు ఎన్‌సీసీ విద్యార్థులకు మెడికల్ సీట్లు లభించేవి. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం 4జూలై 2023న జీవో నెం.75ను జారీ చేసింది. ఎన్‌సీసీ కేడెట్స్‌కు కల్పిస్తున్న 1శాతం రిజర్వేషన్ తొలిగించి, పీడబ్ల్యూడీ కోటాను పెంచుతున్నట్లు పేర్కొంది. వరంగల్‌లోని కాళోజీ హెల్త్ యూనివర్సిటీకి ఈ మేరకు ప్రభుత్వం లేఖ రాసింది. దీంతో గత ఏడాది మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎన్‌సీసీ సర్టిఫికెట్ పని చేయకుండా పోయింది. గత నాలుగైదేళ్లుగా మెడికల్ కోర్సుల్లో ఎన్‌సీసీ కోటాలో ప్రవేశం పొందాలని శిక్షణ పొందిన విద్యార్థులకు నిరాశ మిగిలింది. ఈ ఎన్‌సీసీ కోటాలో ప్రవేశాలు పొందే వారిలో అత్యధికంగా పేదలే ఉన్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఎన్‌సీసీ కోటా ద్వారా మెడికల్ కల నేరవేరుతుందనే ఆశలు గల్లంతయ్యాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వందలాది మంది ఎన్‌సీసీ విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రిజర్వేషన్ పునరుద్ధరించేనా?

దేశభక్తిని పెంచే ఎన్‌సీసీ విద్యార్థులకు మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు. గత ప్రభుత్వం తొలిగించిన 1శాతం రిజర్వేషన్‌ను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా లేక గత పద్ధతినే పాటిస్తుందా అనే ఉత్కంఠలో విద్యార్థులున్నారు. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 10వేల ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు ఉన్నాయి. వీటిలో కన్వీనర్ కోటాలో 6వేల సీట్లు కేటాయిస్తారని, ఎన్‌సీసీ విద్యార్థులకు 1శాతం రిజర్వేషన్ కల్పించిన సుమారు 60మంది ఎన్‌సీసీ కేడెట్స్‌కు మెడికల్ కోర్సుల్లో చేరేందుకు అవకాశం లభిస్తుందనే ఆశతో ఉన్నారు. ప్రొఫెషనల్ కోర్సులైనా ఇంజనీరింగ్, అగ్రికల్చర్, పాలిటెక్నిక్, వెటర్నరీ తదితర అన్ని కోర్సుల్లో ఎన్‌సీసీ కోటా అమలు చేస్తున్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి మెడికల్ కోర్సులో కూడా ఎన్‌సీసీ కోటాను పునరుద్ధరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఆపరేషన్ 'కరెంట్ పోల్'

విద్యుత్ శాఖలో కొత్త ఒరవడి ● అధికారుల చొరవతో మారుతున్న పనితీరు ● అర్జీలు పెట్టకముందే ఏళ్లనాటి సమస్యలకు పరిష్కారం ● ముమ్మరంగా విద్యుత్ స్తంభాలు, లైన్ల మరమ్మతులు ● పోల్స్‌కు నెంబరింగ్‌తో సులభంగా సమస్యల గుర్తింపు

హనుమకొండ టౌన్, ఆగస్టు 5: విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పనితీరు మారుతోంది. ఉన్నతాధికారుల చొరవతో కొత్త ఒరవడి కనిపిస్తోంది. ఒకప్పుడు అర్జీలు పెట్టుకుని, కాళ్ల చెప్పులరిగేలా అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారానికి నోచుకోని సమస్యలకు కూడా సమాధానం దొరుకుతోంది. వరిగిపోయి, తుప్పుపట్టి కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తెగిన, వదులుగా మారిన స్టేవైర్లు, పోల్‌కు పోల్‌కు మధ్య సాగి వేలాడుతున్న లైన్లను సరిచేయడంలో విద్యుత్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తుండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రైతులతో పాటు గృహ వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయా సబ్‌స్టేషన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో సమస్య ఉన్న ప్రాంతాన్ని గుర్తించి మరమ్మతులు చేస్తున్నారు. అలాగే 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ స్తంభాలకు నెంబరింగ్ వేసే ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. ఈ నెంబరింగ్‌తో సబ్ స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్, ఫీడర్ పరిధిలో ఉన్న విద్యుత్ లైన్స్‌లో సమస్య ఉత్పన్నమైనప్పుడు సమస్య ఉన్న ప్రాంతాన్ని విద్యుత్‌శాఖ దగ్గర ఉన్న మ్యాప్ ద్వారా గుర్తించేందుకు వీలు కలుగుతుంది. పసుపు రంగుపై ఎరుపు రంగుతో ఏరియా, పోల్ వరుసక్రమాన్ని స్పష్టంగా కనిపించేలా రాయిస్తున్నారు. దీని ద్వారా విద్యుత్ సిబ్బంది ఎలాంటి ఆటంకాలు లేకుండా సమస్య ఉన్న ప్రాంతానికి చేరుకుంటారు. గతంలో ఈ విధానం ఉన్నప్పటికీ స్పష్టంగా లేకపోవడంతో కొంత మార్పులు చేసి కొత్తగా విద్యుత్ స్తంభాలకు నెంబరింగ్ వేస్తున్నారు. అలాగే వర్షాలు పెరగనున్న నేపథ్యంలో తుప్పుపట్టిన స్తంభాల స్థానంలో కొత్తవి, వంగిన స్తంభాలను నిటారుగా నిలబెట్టే పనులను ఇప్పటికే పూర్తి చేశారు.



మహబూబాబాద్ సర్కిల్‌లో వంగిన తర్వాత, నిటారుగా నిలబెట్టిన తర్వాత విద్యుత్‌స్తంభాల దృశ్యం

సరిచేసినవి, కొత్తవి స్తంభాలు

హనుమకొండ సర్కిల్‌లో..	
నిటారుగా చేసినవి	941
కొత్తవి స్తంభాలు	109
స్టే వైర్లు	158
సరిచేసిన లూజ్‌లైన్‌లు	37 కి.మీ
వరంగల్ సర్కిల్‌లో..	
నిటారుగా చేసినవి	634
కొత్తవి (తుప్పు స్థానం)లో	35
స్టే వైర్లు	245
సరిచేసిన లూజ్ లైన్లు	34 కి.మీ
భూపాలపల్లి, ములుగులో..	
నిటారుగా చేసినవి	507
సరిచేసిన లూజ్ లైన్	5.28 కి.మీ
జనగామలో..	
నిటారుగా చేసిన స్తంభాలు	175

లూజ్‌లైన్లకు మోక్షం

గ్రామాల్లోని చెలకలు, పొలాల వద్ద లూజ్‌లైన్‌ల వద్ద పశువులు, మనుషులు విద్యుత్ వైర్లకు తాకి ఉమ్మడి జిల్లాలో మృత్యువాతపడ్డ ఘటనలు కోకొల్లలు ఉన్నాయి. దీనిని అరికట్టేందుకు విద్యుత్‌శాఖ అనేక ఏళ్లుగా ప్రయత్నిస్తున్నప్పటికీ సమస్యకు పరిష్కార మార్గం చూపలేదు. ఎన్పీడీసీఎల్ సీఎండీగా కర్నాటి వరుణ్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన ఈ 7 నెలల వ్యవధిలో ఎన్పీడీసీఎల్ పరిధిలో లూజ్ లైన్‌లు ఉన్న ప్రతీ చోట మిడిల్ పోల్ ఏర్పాటు చేయడం, సరిపోను స్తంభాలుంటే విద్యుత్ వైర్లను గట్టిగా లాగి సరిచేయడం లాంటివి చేశారు. విద్యుత్ స్తంభాలు వంగకుండా సపోర్ట్‌గా స్టేవైర్లు ఏర్పాటు చేశారు.

తెలుగులో స్వామికి డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 5: కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం పరిశోధకుడు బానోతు స్వామి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు సోమవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి స్వామికి డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'తెలంగాణ గిరిజన కథా సంపుటాలు' అనే అంశంపై కేయూ ఆర్ట్స్ డీన్, తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి పర్యవేక్షణలో బానోతు స్వామి పరిశోధన పూర్తి చేశారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం దేవుని తండాకు చెందిన స్వామి గిరిజన సాహిత్యంలో కథా సాహిత్యంపై ప్రామాణికమైన పరిశోధన గ్రంథాన్ని ప్రచురించారు. జాతీయ గిరిజన ఫెల్లోషిష్ సాధించా రు. కర్ణాటక మైసూర్‌లోని భారతీయ భాషా సంస్థకు ఎంపికయ్యారు. 11 అంతర్జాతీయ, మరో 20 జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. గిరిజన సాహిత్యంపై మళప్ అనే పుస్తకాన్ని ముద్రించారు. డాక్టరేట్ సాధించిన స్వామిని పలువురు అభినందించారు.

బీఈడీ కళాశాలలో దివ్యాంగులకు రేపు ప్రత్యేక శిబిరం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 5: సమగ్ర శిక్ష, అల్మికో ఆధ్వర్యంలో దివ్యాంగులకు బుధవారం హనుమకొండలోని బీఈడీ కళాశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఈవో డాక్టర్ ఎం.డి.అబ్దుల్ హై సోమవారం ఒకప్రటనలో తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు దివ్యాంగ విద్యార్థులను పరీక్షించి వారికి అవసరమైన ఉపకరణాలను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు వారి ఆధార్ కార్డు, ఇన్‌కమ్ సర్టిఫికేట్, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న సదరం సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని రావాలని తెలిపారు. ఉదయం 9 గంటలకల్లా కళాశాలలో ఉండాలని పేర్కొన్నారు.

ఐటీఐలో మూడో దఫా ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 5: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన సీట్ల కోసం నిర్వహిస్తున్న మూడో దఫా ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.చందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొనే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళా విద్యార్థులు సైతం దరఖాస్తులు చేసుకోవచ్చునని, వారికి ప్రవేశాల్లో 33 శాతం రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు.

ముగిసిన డీఎస్సీ పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 5: ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ కోసం నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు సోమవారంతో ముగిశాయి. గత నెల 18 నుంచి సోమవారం వరకు 13 రోజులుగా జిల్లా కేంద్రంలోని 5 ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు సజావుగా ముగిశాయి. మొత్తం 23,467 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 21,305 మంది పరీక్షకు హాజరు కాగా 2,162 మంది గైర్హాజరయ్యారు. కాగా జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో మొత్తం 90.79 శాతం మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు.

9న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 5: వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఈనెల 9న హెచ్‌సీఎల్ సహకారంతో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు డీఐఈవోలు కె.మాధవరావు, ఎ.గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ (కో-ఎడ్) కళాశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో 75 శాతంతో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ, వొకేషనల్ కంప్యూటర్ సైన్స్ ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించి విద్యార్థులు ఈజాబ్ మేళాలలో పాల్గొనవచ్చునని వారు తెలిపారు. జాబ్ మేళాలలో ఉద్యోగం సాధించిన వారికి వేతనంతో పాటు ప్రముఖ వర్సిటీల్లో డిగ్రీ చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు నరేష్ (7569177071)ను సంప్రదించాలని వారు సూచించారు.

20న ఎన్పీడీసీఎల్ స్పోర్ట్స్ కౌన్సిల్ కమిటీ ఎన్నికలు

హనుమకొండ టౌన్, ఆగస్టు 5: టీజీ ఎన్పీడీసీఎల్ స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యుల ఎంపిక కోసం ఈ నెల 20న ఎన్నిక నిర్వహించనున్నట్లు ఉమ్మడి వరంగల్ సర్కిల్ స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్, హనుమకొండ సూపరింటెండెంట్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల12 నుంచి 14 వరకు కొత్తగా ఏర్పాటు కాబోయే కౌన్సిల్ నందు సభ్యత్వం కోసం హనుమకొండ సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ క్రీడాకారుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 17న దాఖలు చేసిన నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. 20న ఎన్నిక నిర్వహించి సాయంత్రం 5 గంటలకు ఫలితాలు వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

నియోజకవర్గంలో అవినీతి అంతమే నా లక్ష్యం

అధికారులకు ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదు : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 5: నియోజకవర్గంలో అవినీతిని అంతమొందించడమే తన లక్ష్యమని, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ మంజూరు ప్రక్రియలో ఎవరూ అధికారులకు ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని, ఏ ఆధికారైన దరఖాస్తును ముందుకు తీసుకెళ్లడానికి డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకురావాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన 35మంది లబ్ధిదారులకు రూ 35,04,060 విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, 140మందికి రూ. 40,50,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇకపై కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను నెల రోజులలోపే లబ్ధిదారులకు అందించేలా కృషి చేస్తానని తెలిపారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి నిమ్స్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్సల కోసం ఎల్‌ఓసీలు ఇప్పించేలా సహకరిస్తానన్నారు. తాను ఎమ్మెల్యే అయితే పనులు జరుగుతాయని, సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుతాయని, అవినీతి ఉండదనే నమ్మకంతో ప్రజలు తనను గెలిపించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలోని వంద పడలక ఆస్పత్రి నిర్మాణానికి నిధులు, వైద్య సిబ్బంది, ఆర్టీసీ డిపోకు కేటాయించిన స్థలాన్ని ఆస్పత్రి నిర్మాణానికి కేటాయించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి వెంటనే అమలు చేసేలా చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ నెలలోనే ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసే అవకాశం ఉందన్నారు. డివిజన్ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.24కోట్ల నిధులతో అంచనాలు రూపొందించి సీఎంకు అందజేశామని, దాంతో సీఎం స్పందించి ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచే కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభిద్దామని పేర్కొన్నట్లు గుర్తు చేశారు. డివిజన్ కేంద్రంలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణానికి, రెండెకరాల విస్తీర్ణంలో పబ్లిక్ గార్డెన్ అందులో వాకింట్ ట్రాక్, జిమ్‌ను ఏర్పాటు చేసేలా ప్రభుత్వ స్థలాలను అధికారులు వెంటనే గుర్తించాలని సూచించారు. రోడ్ల విస్తరణ పనులను చేపట్టబోతున్నామని, తాటికొండ క్రాస్ రోడ్డు నుంచి మల్లన్నగండి రిజర్వాయర్ వరకు, పల్లగుట్ట క్రాస్ రోడ్డు వద్ద నుంచి గార్లగడ్డతండా వరకు, విశ్వనాథపురం నుంచి జఫర్‌గడ్ మండలంలోని ఓబులాపూర్ క్రాస్ రోడ్డు వరకు, ఉన్న సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ రవీందర్, ఎంపీడీవో మధుసూధన్, బ్లాక్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి నాగరబోయిన శ్రీరాములు, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్ రెడ్డి, నాయకులు బెలిదె వెంకన్న, సీహెచ్ నరేందర్ రెడ్డి, రాపోలు మధుసూధన్ రెడ్డి, ఇనుగాల వెంకటేశ్వర్ రెడ్డి, చాడ రాజ్‌కుమార్, చల్లా రాజిరెడ్డి, నాగరబోయిన యాదగిరి, కోతి రాములు, రజాక్‌యాదవ్, గన్ను నర్సింహులు, తెల్లాకుల రామకృష్ణ, తోట వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పొందిన లబ్ధిదారులతో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ఏడ్జర్లపల్లిలో కంటైనర్ ఆస్పత్రిని ప్రారంభించిన సీతక్క



ఏడ్జర్లపల్లిలో కంటైనర్ ఆస్పత్రి ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

వాజేడు, ఆగస్టు 5: వాజేడు మండలంలోని ఏడ్జర్లపల్లి కొత్తురులో నూతనంగా మంజూరైన కంటైనర్ ఆస్పత్రిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క సోమవారం ప్రారంభించారు. సోమవారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర, డీఎంహెచ్‌వో అప్పయ్యతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. కంటైనర్ ఆస్పత్రిలో బీపీని చెక్ చేయించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వాజేడు మండలంను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తాను కట్టుబడి ఉన్నానని, ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. జిల్లాలో రెండో కంటైనర్ ఆస్పత్రిని వాజేడు మండలంలో ప్రారంభించడం ఆనందంగా ఉందని, ఈకంటైనర్ ఆస్పత్రిలో ప్రతి వారంలో రెండు రోజులపాటు వైద్యుడు అందుబాటులో ఉండాలన్నారు. నిత్యం ఏఎన్ఎం విధులు నిర్వహించి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు. జిల్లాలో పలు స్వచ్ఛందసంస్థల సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు జరుపుతున్నామని, స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని, ఇందులో ప్రతీ ఇంటికి ఆరు మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. యువతకు ఉద్యోగాల కల్పన కోసం ఐటీఐల ద్వారా స్కిల్ ప్రోగ్రాంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మహిళలను కోటీశ్వరులను చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నారని, ఆ విధంగా పథకాలను రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘంలో ఉన్న మహిళలకు ప్రమాద బీమా కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. త్వరలోనే భద్రాచలం నియోజకవర్గంలో ఇళ్లను మంజూరు చేస్తానన్నారు. వాజేడు, వెంకటాపురం మండలాలలో వరదల వల్ల ఇబ్బందులు పడుతున్నారని ఆ సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

గుంతల రోడ్డులో సీతక్క కాన్వాయ్ ప్రయాణం

ఏడ్జర్లపల్లికి వచ్చేందుకు మంత్రి సీతక్క ఇబ్బందులు పడ్డారు. పూసూరు నుంచి ఏడ్జర్లపల్లికి సుమారు ఏడు కిలోమీటర్ల రహదారి అధ్వానంగా ఉండటంతో ఆమె కాన్వాయ్ వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో రోడ్డు స్థితిపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన సీతక్క తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. తన శాఖ ద్వారా మరిన్ని నిధులు ఇచ్చి రోడ్లను బాగు చేస్తానని హామీ ఇచ్చారు. ఏడ్జర్లపల్లి చుట్టు పక్కల గ్రామాల ఇబ్బందుల స్వయంగా చూశానని, ఆ ఇబ్బందులను తొలగించేందుకు అధికారులతో మాట్లాడతానన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావుతో కలిసి రెండు మండలాల అభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట జడ్పీటీసీలు తల్లడి పుష్పలత, పాయం రమణ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్ వర్మ, ప్రసాదబాబు రాజు, కల్యాణ్, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగెం, ఆగస్టు 5: గవిచర్ల మోడల్‌స్కూల్‌లోని బాలికల హాస్టల్‌లో బోధనేతర సిబ్బంది నియామకానికి గాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో విజయ్ కుమార్ తెలిపారు. హెడ్‌కుక్ కొరకు 10వ తరగతి పాసై ఉండాలని, అసిస్టెంట్ కుక్ కోసం 7వ తరగతి పాసై ఉండాలని తెలిపారు. ఈనెల 6వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులకు గడువును పొడిగించినట్లు తెలిపారు.

సీపీఐఎంఎల్ లిబరేషన్‌లో చేరికలు

పోచమ్మమైదాన్, ఆగస్టు 5: గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్‌లోని స్టాలిన్‌నగర్ కాలనీలో సోమవారం పలువురు సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీలో చేరారు. పార్టీ తెలంగాణ రాష్ట్ర గైడ్ ఎస్.మూర్తి, రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రాజు, రాష్ట్ర నాయకుడు రొయ్యల రాజు పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అక్కెనపల్లి యాదగిరి, రవిరాకుల ప్రసంగి, చిలువేరు సుష్మిత, జన్ను ప్రవీణ, చిట్టి, కంది రవి, ఎస్కే పాషా పాల్గొన్నారు.



ఆస్పత్రిలో తనిఖీ నిర్వహిస్తున్న మంత్రి

ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో

ఐ బ్యాంక్‌కు చర్యలు

అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

వరంగల్ మెడికల్, ఆగస్టు 5: ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో ఐ బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రిని సోమవారం మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను కలెక్టర్ సత్యశారదతో కలిసి పరిశీలించారు. అనంతరం పేషెంట్లతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న వైద్య సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలపై ఏమైనా ఇబ్బందులుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని అలాంటప్పుడే వాటిని సులభంగా పరిష్కరించవచ్చని మంత్రి అన్నారు. ఫార్మసీ స్టాక్ గదిలో ఔషధ వివరాలను మంత్రి పరిశీలించి ప్రభుత్వ ఆస్పత్రిలో అవసరమైన అన్ని రకాల మందులు అందజేస్తున్నదని, ఎక్కడైనా సమన్వయలోపంతో మందులు సరైన సమయానికి పేషంట్లకు అందుతున్నాయా లేదా అన్న వివరాలు కనుక్కున్నారు.

సమయం పాటించని వారిపై చర్యలకు ఆదేశం

మంత్రి ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న సమయంలో డాక్టర్, ఇద్దరు సిబ్బంది లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో లేని వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. డాక్టర్లు అందుబాటులో ఉండి సమయపాలన పాటిస్తూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. రోగులతో మర్యాదగా మెలగాలని సూచించారు. అనంతరం వైద్యులు, సిబ్బంది హాజరు పట్టిక, బయోమెట్రిక్ అటెండెన్స్‌ను మంత్రి పరిశీలించారు. ఆస్పత్రి మొదటి అంతస్తును పరిశీలించి ఖాళీగా ఉంచకుండా రోగులకు వైద్య సేవలు అందించేందుకు వినియోగించాలని మంత్రి ఆదేశించారు. ఆస్పత్రిలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేసి వారానికోసారి కలెక్టర్ కంప్లైంట్ బాక్స్‌లో అందించిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రి పరిసరాల్లో పరిశుభ్రత పాటించడంతోపాటు పాత భవనం అయినందున వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భరత్ కుమార్, వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు

పోచమ్మమైదాన్, ఆగస్టు 5: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందిస్తామని దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గ్రేటర్ వరంగల్ దేశాయిపేటలోని జర్నలిస్టుల డబుల్ బెడ్‌రూం ఇళ్లను సోమవారం మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ సత్యశారద పరిశీలించారు. పలు బ్లాకులు తిరిగి నిర్మాణ శైలిని పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీకి త్వరలోనే గైడ్‌లైన్స్ వస్తాయని, అవి రాగానే ఇళ్లను అందిస్తామన్నారు. అర్హులైన ప్రతీ జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూం ఇంటిని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కావటి కవితయాదవ్, కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాష్, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.



జర్నలిస్టుల డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్

నగరంలో స్వచ్ఛదనం-పచ్చదనం









తూర్పుకోటలో రోడ్డును ఊడుస్తున్న నాయకులు, చింతల్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్, కరీమబాద్‌లో అంగన్‌వాడీల ర్యాలీ, గవిచర్లలో ర్యాలీలో పాల్గొన్న గ్రామస్థులు

ఖిలావరంగల్, ఆగస్టు 5: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో నగరంలో సోమవారం ఘనంగా జరిగింది. 18, 34, 35, 37, 38 డివిజన్లలో పశువుల ఆస్పత్రి, అంగన్‌వాడీ సెంటర్‌లు, పాఠశాలలు, వీధులు, రోడ్లు, తదితర ప్రాంతాలలో నిల్వ ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. శివనగర్, క్రిస్టియన్‌కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వస్కుల బాబు, దిడ్డి కుమారస్వామి, సోమిశెట్టి ప్రవీణ్, వెల్పుగొండ సువర్ణసురేష్, బైరబోయిన ఉమాదామోదర్‌యాదవ్ పాల్గొన్నారు. 17, 41, 42, 43 డివిజన్‌లలో ర్యాలీలను నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు గద్దె బాబు, పోశాల పద్మస్వామిగౌడ్, గుండు చందన పూర్ణచందర్, అరుణావిక్టర్ పాల్గొన్నారు.

- సంగెం: సంగెం మండల వ్యాప్తంగా గ్రామస్థుల కు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. గ్రామ కూడళ్ల వద్ద, గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద సమావేశాలను నిర్వహించి గ్రామాల్లో పారిశుధ్యం పాటించాలని అధికారులు చెప్పారు.
- పోచమ్మమైదాన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మూడో డివిజన్ కార్పొరేటర్ జన్ను షిబారాణిఅనిల్ అన్నారు. ఫైడిపెల్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జన్ను అనిల్‌కుమార్, జన్ను రాజయ్య జన్ను అరుణాకర్, సుధాకర్, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.
- కరీమాబాద్: 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డివిజన్ ఆఫీసర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకన్న ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీని ప్రారంభించారు. సీఆర్‌సీ భవనం నుంచి దర్గా, చెట్లవారి గడ్డ, కరీమాబాద్ శివాలయం, వాటర్‌ట్యాంక్ వరకు నిర్వహించారు. అనంతరం వాటర్ ట్యాంక్ ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ శంకర్, ఏఎన్ఎం అనిత, రజిత, జవాన్ ప్రశాంత్ పాల్గొన్నారు.
- మిల్స్‌కాలనీ: పరిసరాలు పచ్చదనంతో ఉంటే, ఆరోగ్యంతో ఉంటామని బల్దియా డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్‌మసూద్ అన్నారు. 36వ డివిజన్ చింతల్‌లోని ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బల్దియా స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.
- గిర్మాజీపేట: కృష్ణకాలనీ ప్రభుత్వ హైస్కూల్, వరంగల్ తాత్కాలిక బస్‌స్టేషన్ ప్రాంగణాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. కార్పొరేటర్ అనిల్‌కుమార్ కృష్ణకాలనీ ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులతో కలిసి చెత్తాచెదారం తొలగించారు. పాఠశాల ఆవరణను శుభ్రం చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్ కుమార్‌పాల్గొన్నారు. ఆర్టీసీ తాత్కాలిక బస్‌స్టేషన్ ఆవరణతోపాటుగా గోవిందరాజుల గుట్ట ప్రాంతంలో స్థానికులతో కలిసి కార్పొరేటర్ అనిల్ కుమార్ పరిసరాలు పరిశుభ్రం చేశారు.

కేరళ బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలను సేకరిస్తున్న సీపీఐ నాయకులు

ఖిలావరంగల్, ఆగస్టు 5: కేరళ వరద బాధితులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ భాసుమియా, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్‌లు కోరారు. సోమవారం సీపీఐ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా విరాళాల సేకరణను చేపట్టామన్నారు. వరంగల్ హెడ్ పోస్టాఫీస్ నుంచి పోచమ్మమైదాన్ వరకు షాపుల నుంచి విరాళాలను సేకరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దండు లక్ష్మణ్, బుస్స రవిందర్, గన్నారపు రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు దామెర కృష్ణ, ఎమ్డీ అక్బర్‌పాషా, ల్యాదళ్ళ శరత్, టి.జాన్‌పాల్, నరేష్, మనోహర్ పాల్గొన్నారు.

- కరీమాబాద్: కేరళను ఆదుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికి తిరిగి నిధిని సేకరించారు. కార్యక్రమంలో ప్రభాకర్, అప్పాజీ, వాణి, ఇస్మాయిల్, యాకుబ్ పాషా, శ్రీను, లక్ష్మి, మురళీ, ఉపేందర్, మోహబూబ్, సూరయ్య తదితనేలే పాల్గొన్నారు

బీసీ జాతీయ సభకు తరలిన నేతలు



రైల్వేస్టేషన్ వద్ద నినాదాలు చేస్తున్న బీసీ నేతలు

గిర్మాజిపేట, ఆగస్టు5: జనాభా దామాషా ప్రకారం బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్‌లు, కేంద్రం ప్రభుత్వంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో బుధవారం అమృత్‌సర్‌లో జరిగే బీసీల జాతీయ సభ హలో బీసీ.. చలో అమృత్‌సర్ కార్యక్రమానికి సోమవారం వరంగల్ నుంచి 100 మంది బీసీ నాయకులు తరలివెళ్లారు. సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ ఆధ్వర్యంలో వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి బయ లుదేరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వేముల మహేందర్ గౌడ్, పర్కాల సమ్మయ్య గౌడ్, హరిప్రసాద్, నాగరాజు గౌడ్, డ్యాగల శ్రీనివాస్, బాలాజీ, మల్లేషం, కృష్ణ, మధుకర్, నరేష్ పాల్గొన్నారు.

'మా భూములను ఆక్రమిస్తున్నారు'

గీసుగొండ, ఆగస్టు 5: భూములు కొనుగోలుచేసి గత 35ఏళ్ల నుంచి సాగు చేసుకుంటుంటే, అక్రమ సర్వేలతో ఆక్రమించుకునేందుకు కొందరు యత్నిస్తున్నారని 25మంది బాధితులు తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మొగిలిచర్లకు చెందిన బొబ్బాల రమాదేవి, అప్పని రాజ్‌కుమార్‌తోపాటు 25 మంది రైతులు 66 ఎకరాల ఏళ్ల క్రితం కొని సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. కొద్దిరోజుల క్రితం రెడ్డిపాలెంకు చెందిన తప్పుడు సర్వేలు చేయించుకొని తమ భూముల్లోకి వచ్చి హద్దులు నాటారని, తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాధితులు లక్ష్మణ్, బిట్ల కార్తీక్, నూకల శ్రీదేవి, మండ రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద ఆస్పత్రిలో రక్తదాన శిబిరం

గిర్మాజిపేట, ఆగస్టు 5: అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యకళాశాల జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ఆయుర్వేద బోధనాస్పత్రిలో రక్తదాన శిబిరం జరిగింది. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆత్మీయ వరంగల్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 30మంది ఆయుర్వేద వైద్య విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రక్తదానం చేశారు. బోధనాస్పత్రి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగన్మోహనాచారి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, అవసరమైన వారికి అపత్కాలంలో తప్పనిసరిగా ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అశోక్‌కుమార్, బోధనాఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేశ్వరి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఈశ్వర్, కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మహేష్ పాల్గొన్నారు.

శ్రావణమాస ఉత్సవాలకు శ్రీకారం



పట్టు వస్త్రాలతో కలెక్టర్, మంత్రి

మట్టెవాడ, ఆగస్టు 5: వరంగల్ బట్టలబజారులోని శ్రీ బాలానగర వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాస పవిత్రోత్సవాలను కలెక్టర్ సత్యశారదతో కలిసి దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సోమవారం ప్రారంభించారు. మంత్రి ఆలయ అభివృద్ధిపై ఈవో రత్నాకర్‌రెడ్డితో చర్చించారు. కార్యక్రమంలో 28వ డివిజన్ కార్పొరేటర్ గండె కల్పనా నవీన్, ఆలయ ఈవో రత్నాకర్‌రెడ్డి, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు, ఆలయ సేవా సమితి సభ్యులు, గండె గోవిందరాజులు, ఆలయ అర్చకులు, కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాశ్, దాసరి రాజేష్, వివిధ సేవా సమితుల, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

- వరంగల్ కల్చరల్ : శ్రావణ మాసోత్సవాలు సోమవారం ఘనంగా ఆరంభమయ్యాయి. మొదట సోమవారం రావడంతో శివాలయాల్లో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను నిర్వహించారు. భద్రకాళి అమ్మవారి దేవాలయంలో శ్రీసరస్వతి మాత ఆలయం, అయ్యప్ప స్వామి దేవాలయం, ఎంజీఎం సెంటర్‌లోని శ్రీరాజరాజేశ్వరి దేవాలయం, మట్టెవాడలోని భోగేశ్వ రాలయం, రామన్నపేటలోని రామలింగేశ్వరాలయం, పిన్నవారి వీధిలోని దుర్గేశ్వరాలయం, స్టేషన్ రోడ్డులోని కాశీ విశ్వేశ్వరాలయం, కాశిబుగ్గలోని శ్రీకాశీ విశ్వేశ్వరాలయం, గీతాభవన్, ఓసిటీ, గిర్మాజీపేటలోని శివాలయం, కరీమాబాద్‌లోని బొమ్మలగుడి ఆంజనేయ స్వామి ఆలయం, ములుగురోడ్ లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రం, గురుధామం, హరిహర క్షేత్రం, పలు దేవాలయాల్లో శ్రావణమాసం పూజలు నిర్వహించారు. ములు గురోడ్‌లోని దత్తక్షేత్రంలో నెలరోజులపాటు నిర్వహించే మాసోత్సవాల కలశ స్థాపన చేసి కుంకుమ పూజలు నిర్వహించారు.

కరాటేలో ప్రతిభచాటిన విద్యార్థులు

గీసుగొండ, ఆగస్టు 5: ఈనెల 3,4 తేదీల్లో మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో నిర్వహించిన 9వ జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ఎలుకుర్తికి చెందిన వనపర్తి రవళి ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించినట్లు మార్షల్ ఆర్ట్స్ కోచ్ భరత్ సోమవారం తెలిపారు. 12 ఏళ్ల లోపు కమిటీ ఈవెంట్‌లో రవళి బంగారు పతకం సాధించటంతో గ్రామస్థులు, స్కాలర్ స్కూల్ ప్రిన్సిపాల్ సంకీర్తనరెడ్డి, మార్షల్ ఆర్ట్స్ చీఫ్ హసన్, అభిషేక్ అభినందించారు.

- సంగెం: కరీంనగర్‌లో ఆదివారం జరిగిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో మండలంలోని గవిచర్ల మోడల్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. వివిధ విభాగాల్లో 2 గోల్డ్‌మెడల్స్, పలు సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించి విన్నర్స్ కప్ కైవసం చేసుకున్నారు. ఈసందర్భంగా సోమవారం పాఠశాలలో మెడల్స్ సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల

సభను జయప్రదం చేయండి



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

గిర్మాజిపేట, ఆగస్టు 5: ఈనెల 11న కాజీపేటలో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక సభను జయప్రదం చేయాలని వేదిక గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు కె.ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం అండర్‌బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్ (ఎంసీపీఐ జిల్లా కార్యాలయం)లో హనుమకొండ కన్వీనర్ జీ.కే.స్వామి అధ్యక్షతన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు- ప్రభుత్వ వైఖరిపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సందర్భంగా పెట్టిన పోలీసు కేసులు, సంఘటనలు, పోలీసు నిఘావర్గాల సమాచారం పరిగణలోకి తీసుకుని తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు, సంక్షేమ పథకాలు, 200 గజాల ఇంటి స్థలం కేటాయించాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం నాయకుడు సోమిడి శ్రీనివాస్, ఉద్యమకారులు చంద్రమౌళి, బుల్లెట్ వెంకన్న, మోతిసింగ్, రామారావు, సాంబయ్య, విజయ్ పాల్గొన్నారు.

సిటీ ప్లానర్‌ను కలిసిన బీజేపీ నాయకులు

మట్టెవాడ, ఆగస్టు 5: గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ సిటీ ప్లానర్‌గా బాధ్యతలు చేపట్టిన శైలజను సోమవారం పలువురు కలిసి అభినందనలు తెలిపారు. సిటీ ప్లానర్‌గా ప్రమోషన్‌పై వరంగల్‌కు వచ్చిన శైలజను బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ కలిసి అభినందనలు తెలిపారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న నన్నపునేని



అమ్మవారికి పూజలు చేస్తున్న నరేందర్

వరంగల్ కల్చరల్, ఆగస్టు 5: మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సోమవారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. తన జన్మదినం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు, ఆయన వెంట అమ్మవారి ఆలయానికి విచ్చేశారు.

- కరీమాబాద్: మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ జన్మదిన వేడుకలను 40వ డివిజన్‌లో కార్యకర్తలు, నాయకులు ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్ ఆధ్వర్యంలో ఉర్సు సీఆర్‌సీ భవనం వద్ద కార్పొరేటర్ మరుపల్ల రవి కేక్ కట్ చేశారు. తన జన్మదినం సందర్భంగా నన్నపునేని నరేందర్ 40వ డివిజన్‌లోని మంకీ ఫుడ్ కోర్టులో మొక్కను నాటారు. కార్యక్రమంలో మరుపల్ల గౌతం, సాంబయ్య వెంకటేశ్వర్లు, రమేష్, రాజు, నర సింహా, నవీన్, రాధిక, వహీదా, మచ్చ కవిత, రజిని పాల్గొన్నారు.

నాస్ సర్వేలో రాష్ట్రాన్ని ముందంజలో ఉంచాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌సీఈఆర్టీ పర్యవేక్షకుడు జగన్‌మోహన్

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 5: నేషనల్ అచీవ్ మెంట్ సర్వే (నాస్ సర్వే)లో రాష్ట్రాన్ని ముందంజలో ఉంచాలని ఎస్‌సీఈఆర్టీ పర్యవేక్షకుడు జగన్‌మోహన్ సూచించారు. సోమవారం వరంగల్ మట్టెవాడ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసి నాస్ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్ మాట్లాడుతూ... విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు సాధించేలాఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కె.అరుణ ఎంఈవో ఎం. విజయ్‌కుమార్, కాంప్లెక్స్ సెక్రెటరీ సులోచన, ఆర్పీలు కిరణ్, అశోక్, తులసిరాణి, రామారావు, కృష్ణారెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

CRIME BOX

వైన్‌షాప్‌లో చోరీ



సీసీ పుటేజీలో రికార్డు అయిన నిందితుడు

కరీమాబాద్, ఆగస్టు 5: వరంగల్ ఫోర్ట్‌రోడ్‌లోని వజ్ర వైన్స్ షాప్‌లో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం ఆదివారం రాత్రి షాప్‌కు తాళం వేసి నిర్వాహకులు వెళ్లిపోయారు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రేకుల కింద ఉన్న సీలింగ్‌ను ధ్వంసం చేసి, లోపలికి ప్రవేశించారు. కౌంటర్‌లోని రూ.30వేల నగదును అపహరించాడు. నిందితుడు ఆధారాలు లభించకుండా వెలిముద్రలను చెరిపే ప్రయత్నం షాప్‌లోని సీసీ కెమెరాలో రికార్డయింది. సోమవారం ఉదయం షాపు తెరిచి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించి, నిర్వాహకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

గంజాయి పట్టివేత



గీసుగొండ, ఆగస్టు 5: గ్రేటర్ పరిధిలోని 16వ డివిజన్ జాన్‌పాక వద్ద రెండు కిలోల ఎండు గంజాయిని పట్టుకొని ఒకరిని అరెస్టు చేసినట్టు సీఐ బాబులాల్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం సోమవారం జాన్‌పాక వద్ద మన్నా చర్చ్ ఎదురుగా వరంగల్-నర్సంపేట రహదారిపై పోలీసులు వాహనాలను తనిఖీలు చేపట్టారు. క్రమంలో మండలంలోని ధర్మతండాకు చెందిన కేలోతు రాకేష్ చౌహాన్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా వెళ్తుండగా పట్టుకుని విచారించారు. దీంతో అతడి నుంచి రెండు కిలోల ఎండు గంజాయి లభించింది. గంజాయిని, వాహనాన్ని స్వాధీనం చేసుకొని రాకేష్‌చౌహాన్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య



గీసుగొండ, ఆగస్టు 5: కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో గణేషా కంపెనీలో పనిచేస్తున్న మహిళ సోమ వారం ఆత్మహత్యకు పాల్పడి నట్టు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం. జార్ఖండ్ రాష్ట్రం హుండీ గ్రామా నికి చెందిన కాజాదేవి(30), ఆమె భర్త రింకు కొద్ది నెలల క్రితం ఉపాధి కోసం టెక్స్‌టైల్ పార్కుకు వచ్చారు. గణేషా కంపెనీలో భార్యా భర్తలు రోజువారి కూలీగా పనిచేస్తున్నారు. ఆరు నెలల క్రితం కుమారుడు అనారోగ్యంతో చనిపోవడంతో మనస్తాపం చెందిన కాజాదేవి గేటు వద్ద గల గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

27 మందికి జరిమానా

మట్టెవాడ, ఆగస్టు 5: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 27 మంది వాహనదారులకు వరంగల్ సకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా, మరో ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 27 మంది వాహనదారులకు రూ.34,500 జరిమానా, ఇద్దరికి జైలు శిక్ష, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురు వాహనదారులకు రూ. 6,000 జరిమానా విధించినట్లు తెలిపారు.



ఇటుకాలపల్లిలో పోలీసుల కార్డన్‌సెర్చ్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

నర్సంపేట టౌన్, ఆగస్టు 5 : మండలంలోని ఇటుకాలపల్లిలో సోమవారం పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని వాహనాలను తనిఖీ చేయగా సరైన ధ్రువీకరణ పత్రాలులేని 40 ద్విచక్రవాహనాలు, 10 ఆటోలను, 40 పౌచ్‌ల అంబర్ ప్యాకెట్లు, 10 లీటర్ల గుడుంబాను పోలీసులు స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం గ్రామ ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్, నార్కోటిక్ డ్రగ్స్, గంజాయి, ట్రాఫికింగ్, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి, సబ్ డివిజన్ సీఐలు చంద్రమోహన్, రాజగోపాల్, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్

- చెప్పిన పనులు పూర్తిచేయించని ఇంజనీర్లు, డాక్టర్లపై ఆగ్రహం
- ఓపీ ప్రారంభానికి అవసరమైన పనులు పూర్తిచేయాలని ఆదేశం



ఇంజనీర్లు, డాక్టర్లపై ఆగ్రహిస్తున్న కలెక్టర్ సత్య శారద

నర్సంపేట, ఆగస్టు 5 : నర్సంపేట పట్టణ శివారులోని జిల్లా ఆస్పత్రి భవనాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ సత్యశారద సందర్శించారు. ఆస్పత్రిలోని గదులు, ఇతర పనులను పరిశీలించారు. కొద్ది రోజుల క్రితం ఆస్పత్రి సందర్శనకు వచ్చిన సమయంలో ఆస్పత్రిలో పనులను పూర్తిచేయాలని చెప్పినప్పటికీ ఎందుకు పూర్తిచేయించలేదని ఇంజనీర్లను. డాక్టర్లపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి భవనానికి సమీపంలోని ప్రధాన రోడ్డు నుంచి ఆస్పత్రి వరకు మిషన్ భగీరథ పనులు పూర్తి చేయాలని, ఆస్పత్రిలో 15 నుంచి 20బెడ్‌లను ఏర్పాటు చేసి ఓపీ వైద్య సేవలు ట్రయల్ రన్ చేయాలని సూచించినా ఎందుకు ఆ పనులను ఎందుకు చేపట్టలేదని అధికారులపై, డాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో ఓపీ ప్రారంభించడానికి అవసరమైన ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కాంట్రాక్టర్ నిర్మాణ పనులను నత్తనడకన కొనసాగిస్తున్నారని, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలో ఇంటర్‌నెట్ సౌకర్యంతో పాటు బెడ్లు, ఫార్మసీ, ల్యాబ్‌లను వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలకు చెందిన గదుల ముందు అంటించిన పేపర్లను తొలగించి సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులు. డాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ గోపాల్, డీఈ రాజశేఖర్, ఈఈ ప్రసాద్, ఏఈ వేణుతోపాటు డాక్టర్లు పాల్గొన్నారు.

- **నియామకాలు పారదర్శకంగా జరుగుతాయి**

నర్సంపేట టౌన్: నర్సంపేట పట్టణంలోని మెడికల్ కళాశాలలో చేపట్టనున్న నియామకాలు పారదర్శకంగా జరుగుతాయని జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. మెడికల్ కళాశాలలో 180పోస్టుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణను నవోదయ ఏజెన్సీకి ప్రభుత్వం అప్పగించడం జరిగింది. పట్టణంలోని వరంగల్ రోడ్‌లోని నవోదయ ఏజెన్సీ వద్ద సోమవారం చివరి రోజు కావడంతో దరఖాస్తుదారులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ఇదే సందర్భంలో అటువైపు వెళ్తున్న కలెక్టర్ ఏజెన్సీ వద్దకు చేరుకొని దరఖాస్తుదారులతో మాట్లాడారు. నియామకాల్లో కొంతమంది పైరవీలు చేస్తున్నారని, అవకతవకలు జరుగుతున్నాయని దరఖాస్తుదారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, నియామకాల్లో ఎలాంటి అవకతవకలు జరగవని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుదారులు సోమవారం చివరి రోజు కావడంతో ఏజెన్సీలో కాకుండా నేరుగా దరఖాస్తులను కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేయాలని సూచించారు.

ఆస్పత్రి. వైద్య కళాశాల భవనాలను సందర్శించిన ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట : నర్సంపేట పట్టణ శివారులో నిర్మాణం పూర్తిదశకు చేరిన జిల్లా ఆస్పత్రి, వైద్యకళాశాల భవనాలను డాక్టర్లు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సందర్శించారు. భవన నిర్మాణ పనులను వివిధ విభాగాలకు చెందిన గదులను ఆయన పరిశీలించారు. ఆస్పత్రి. వైద్య కళాశాల భవనాల్లో అరకొర పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆయన సూచించారు. జిల్లా ఆస్పత్రి భవనాన్ని ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు వైద్యశాఖ మంత్రిచే ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని, అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఆస్పత్రిలోని మిగిలిన పనులను ఈ లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరం వైద్యకళాశాలలో 50మంది విద్యార్థులకు అడ్మిషన్లు పొందడానికి ప్రభుత్వం అనుమతినిచ్చిందన్నారు. కార్యక్రమంలో వైద్యకళాశాల డాక్టర్లు, ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ గోపాల్, వైద్యకళాప్రిన్సిపాల్ మోహన్‌దాస్, మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి తక్కళ్ళపల్లిరవీందర్‌రావు, పీసీసీ సభ్యుడు పెండెం రామానందర్, ఓబీసీవిభాగం జిల్లా చైర్మెన్ ఓర్సు తిరుపతి, మాజీ సర్పంచు చిలువేరు రజనీభారతి, ఆడెపు రమ. కౌన్సిలర్లు వేములసాంబయ్య, విజయ్‌కుమార్, బత్తిని రాజేందర్, దండెం రథన్‌కుమార్, కొంకీస మధన్, మండల కాం గ్రెస్ అధ్యక్షుడు బానోతు లక్ష్మన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం ప్రతీ ఒక్కరి బాధ్యత



నర్సంపేటలో మొక్కకు నీరుపోస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



వర్ధన్నపేటలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే నాగరాజు, చైర్‌పర్సన్ అరుణ

నర్సంపేట, ఆగస్టు 5 : మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములై నర్సంపేట పట్టణాన్ని గ్రీన్‌సిటీగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా పట్టణంలోని 22వ వార్డులోని సాయిబాబా దేవాలయం సమీపంలో సోమవారం అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళలతో కలిసి మొక్కలు నాటారు. మునిసిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ రాజేశ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల ప్రజలు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పూలు. పండ్లు, కూరగాయల మొక్కలను నాటి వాటిని పరిరక్షించి ఫలసహాయం పొందాలన్నారు. రోడ్లు, మురికి కాల్వలు ఎప్పటికప్పుడు కార్మికులు పరిశుభ్రం చేయాలని, వారిచే పనులను ప్రజా ప్రతినిధులు, మహిళాసంఘాల సభ్యులు చేయించడానికి కృషి చేయాలన్నారు. పట్టణ ప్రజలకు 365 రోజులు తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో రూ:42 కోట్లు మంజూరి చేయించానని, అందులో రూ:12 కోట్లు డీఫ్లోరైడ్ ప్రాజెక్టు మరమ్మతులకు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. మాడల్ స్కూల్ భవనం మరమ్మతులు, టాయిలెట్ల నిర్మాణం కోసం నిధులు మంజూరి చేయిస్తానని, ఇద్దరు ఉపాధ్యాయుల నియామకం కోసం తన వంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని. మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కౌన్సిలర్లు వేముల సాంబయ్యగౌడ్, ఎలకంటి రాజేందర్, బత్తిని రాజేందర్, పెండెం లక్ష్మి, ఓర్సు అంజలి, మాజీసర్పంచు చిలువేరు రజనీభారతి,ఆడెపు రమ, పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి తక్కళ్ళపల్లి రవీందర్‌రావు, ఓబీసీజిల్లా చైర్మెన్ ఓర్సుతిరుపతి, దండెంరథన్‌కుమార్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొంకీస మధన్‌కుమార్‌గౌడ్, శ్రీనివాస్. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బానోతు లక్ష్మన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

- వర్ధన్నపేట : మొక్కలు విరివిగా నాటి సంరక్షిస్తేనే వాతావరణంలో సమతుల్యంగా ఉండి భారీగా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలతో సస్యశ్యామలంగా మారుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. పట్టణంలోని 1వ వార్డులో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ జోనా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్ధన్నపేట మునిసిపాలిటీని ఆదర్శంగా నిలిపేందుకు పారిశుధ్య పనులు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. తడిచెత్త, పొడిచెత్తను వేరువేరుగా చేసి మునిసిపాలిటీ చెత్తసేకరణ వాహనానికి అప్పగిస్తే సేంద్రియ ఎరువుగా తయారు చేస్తారన్నారు. అనంతరం దోమల నివారణకు 1వ వార్డు డ్రైనేజీలోని మురుగునీటిలో ఆయిల్‌బాల్స్ వేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంగోత్ అరుణ, తహశీల్దార్ విజయసాగర్, డీఎంసీ రేణుక, ఏడీఎంసీ వహీదా, కౌన్సిలర్లు సమ్మెట సుధీర్, తుమ్మల రవీందర్ తదితరులు ఉన్నారు.
- వర్ధన్నపేట రూరల్: భావితరాల పిల్లలకు ప్రతీ ఒక్కరు స్వచ్ఛమైన పచ్చ నైన గ్రామాలను అందించేందుకు కృషిచేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగ రాజు సూచించారు. మండలంలోని దమ్మన్నపేటలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ దనం-పచ్చదనంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట రమణ, ఎంపీవో ధనలక్ష్మి, రాష్ట్ర కాంగ్రెస్ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు నిమ్మాని శేఖర్‌రావు, కార్యదర్శి జ్యోతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, జిల్లా నాయకుడు పోశాల వెంకన్న, నాయకులు రాజాలు, రమేష్, రాజు, గ్రామస్థులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని చెన్నారంలో వరంగల్ జడ్పీ సీఈవో, జిల్లా ఇన్‌చార్జి డీపీవో రాంరెడ్డి, స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో వెంకరమణతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. పురవీధుల గుండా తిరుగుతూ కిరాణ షాపుల్లో ప్లాస్టిక్ వాడొద్దని సూచించారు. ఇల్లందలో స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ విజయ్‌సాగర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కట్ర్యాలలో జీపీ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీధర‌రెడ్డి, సాంబరెడ్డి, విద్యార్థులతో కలిసి మొక్కలునాటారు. కడారిగూడెంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. కొత్తపెల్లిలో పల్లె ప్రకృతి వనాలను శుభ్రం చేశారు. ఉప్పరపెల్లిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. దమ్మన్నపేటలో స్పెషల్ ఆఫీసర్, ఎంపీవో ధనలక్ష్మి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేసి స్వచ్ఛదనం- పచ్చదనంపై అవగాహన సదస్సు నిర్వహించారు.నల్లబెల్లి, ల్యాబర్తి, రామవరం, బండౌతపురం, అంబేడ్కర్‌నగర్ గ్రామాల్లో స్వచ్ఛత ర్యాలీలు, గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.
- దుగ్గొండి : మండలంలోని వెంకటాపురంలో నిర్వహించిన ర్యాలీలో ఎంపీడీవో అరుంధతి మాట్లాడుతూ ఈ నెల 5నుంచి 9వ తేది వరకు గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దుగ్గొండిలో తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, తిమ్మంపేటలో ఏవో దయాకర్, వివిధ గ్రామాలలో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.
- చెన్నారావుపేట : స్వచ్ఛదనం-పచ్చదనంలో అందరూ భాగస్వాములు కావాలని జడ్పీసీఈవో రాంరెడ్డి అన్నారు. ఎల్లాయిగూడెంలో మొక్కలు నాటారు. ఉప్పరపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ బాలాజీ, ఉపాధ్యాయులు, అధికారులు కలిసి మొక్కలు నాటారు. మండల కేంద్రంలో డీఎల్‌పీవో రాజీవ్‌కుమార్ గ్రామ సభను నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీవో శ్రీధర్‌రాజు, ఏపీవో అరుణ, ఏపీఎం ఈశ్వరయ్య, హెచ్‌ఎం జయ, ఉపాధ్యాయులు పిన్నింటి బాలాజీరావు, ఉదయ్‌కుమార్, మాధవి, సుందర్, ఇందిర, సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
- ఖానాపురం : మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి సౌజన్య, తహసీల్దార్ కిరణ్‌కుమార్ పాల్గొని పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత తదితర కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో సునిత, పంచాయతీ కార్యదర్శి సుప్రజ, ఏఎన్‌ఎం సునీత తదితరులు పాల్గొన్నారు.
- రాయపర్తి : మండలంలోని కొండూరులో ఎంపీవో ప్రకాష్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు సైతం భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం వీవోఏ కరుణ శ్రీ, కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.
- నెక్కొండ: పరిసరాల్లో స్వచ్ఛదనం ఎంత ముఖ్యమో పచ్చదనం కోసం మొక్కలు నాటడం అంతే ముఖ్యమని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాశ్ అన్నారు. ఆరోగ్య కేంద్రం అవరణలో అధికారులతో కలసి మొక్కలను నాటినారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం డాక్టర్ సుమన్, ఈజీఎస్ ఎపీవో జాకోబ్, పీహెచ్‌ఎన్ అరుణ, హెచ్‌వీ వర్మ, హెల్త్ అసిస్టెంట్ సంజీవ్‌కుమార్, సరిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.
- పర్వతగిరి: పల్లెలు పచ్చగా ఉండాలని, అప్పుడే పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందని డీసీవో, మండల స్పెషల్ ఆఫీసర్ బి.సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో శ్రీనివాసులు, ఏపీవో సుశీల్‌కుమార్, కార్యదర్శి రఘు, హెచ్‌ఎంలు పాక రమేష్‌బాబు, వెంకట రమణారెడ్డి, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, వీవోఏలు పాల్గొన్నారు.

సర్కారు బడి వజ్రోత్సవ సన్నాహక సమావేశం



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 5 : మండలంలోని ఇల్లంద ప్రభుత్వ పాఠశాలలో వజ్రోత్సవం నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు నడుం బిగించారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో సన్నాహక సమావేశం ఏర్పాటుచేశారు. గ్రామం లో బడి పురుడుపోసుకొని 75 సంవత్సరాలు కావొస్తున్న సందర్భంగా 1949 నుంచి 2023 వరకు ఏడో తరగతితో పాటు పదో తరగతి పూర్తిచేసుకుని వెళ్లిన పూర్వ విద్యార్థులతో వజ్రోత్సవం నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. 1949-80 వరకు ఏడవ తరగతి ఉండగా, 1981-2023 వరకు పదో తరగతి పూర్తి చేసిన వారు 43 బ్యాచ్‌లు ఉన్నట్లు గుర్తించారు. దీనిలో భాగంగా ప్రతి బ్యాచును వేడుకల్లో భాగస్వాములను చేసేలా అడహక్ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా సంక్రాంతి సెలవుల్లో వజ్రోత్సవాలు చేసేలా నిర్ణయించారు. అడహక్ కమిటీకి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మోడెం కుమారస్వామితో పాటు 16 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



టీచర్లను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

గీసుగొండ, ఆగస్టు 5: చెన్నారావుపేట మండలం గురిజాలకు చెందిన పూర్వ విద్యార్థులు 37 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. 1985-86 టెన్త్ విద్యార్థుల ఆత్మీయ సమ్మెళనం సోమవారం కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ మేరకు నాటి ఉపాధ్యాయులను సన్మానించి, పాదాభివందనాలు చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, నర్సింగం, ఎల్లయ్య, బండారి సూర్యప్రకాష్, జగన్నాథచారి, ముప్పు రవి, రమాదేవి, అనితాదేవి, మంగమ్మ, విజయశ్రీ, ఇందిర పాల్గొన్నారు.

రుణమాఫీలో ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం



జేడీ ఉషకు వినతి పత్రం అందిస్తున్న రైతులు

నెక్కొండ, ఆగస్టు 5 : రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీలో అర్థంపర్థంలేని నిబంధనలు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నదంటూ వరంగల్ జేడీఏ కార్యాలయంలో జేడీ ఉషకు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ దత్తత గ్రామాలు అలంకానిపేట, తోపనపల్లి, బొల్లికొండ గ్రామాల రైతులు 1900 మంది పంట రుణాలను తీసుకున్నారన్నారు. కేవలం 380 మంది రైతులకు మాత్రమే రుణాలు మాఫీ అయ్యాయని, 1500 మంది రైతులు రుణమాఫీకి అర్హత ఉన్నప్పటికీ వారికి కాలేదన్నారు. రుణమాఫీ విషయంలో బ్యాంక్‌లకు వెళితే వ్యవసాయాధికారి కార్యాలయానికి వెళ్లమంటున్నారని, అక్కడికి వెళ్లితే తమకు సంబంధం లేదంటూ అధికారులు దాటవేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన రైతులకు రుణాలను మాఫీ చేయించాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ సూరం రాజిరెడ్డి, మాదాసు రవి, యాకయ్య, ఎల్లెందర్, ఎడ్ల అశోక్, స్వామి, కుమార స్వామి, వెంకన్న, వెంకటేశ్, శ్రీనివాస్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీరులో పురుగులు



బీరులో ఉన్న పురుగులు

నల్లబెల్లి, ఆగస్టు 5 : మండల కేంద్రంలోని ఓ వైన్స్ షాపులో తాగే బీరులో పురుగులు వచ్చిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ముచ్చింపుల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు రోజువారి పనులు ముగించుకుని శారీరక శ్రమను మరిచిపోయేందుకు మండల కేంద్రంలోని ఓ వైన్‌షాపుకు వచ్చి బీర్లు తీసుకుని ఓపెన్ చేసి ఓ వ్యక్తి తాగాడు. అనంతరం నోట్లోకి పురుగులు వెళ్లడంతో ఒక్కసారిగా అవాక్కయ్యాడు. అనంతరం వైన్ షాపు సిబ్బందిని పిలిచి ఏందిది బీర్‌లో పురుగులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే వాంతులు కూడా అయినట్లు కూడా బాధిత వ్యక్తి తెలిపాడు. వైన్‌షాపు బాధ్యులు బాధ్యత వహించాలని కోరారు.

ఆలయాల్లో పోటెత్తిన భక్తులు



ఇల్లంద శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 5 : మండలంలోని ఇల్లంద గ్రామ శివారులోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి సోమవారం శ్రావణమాసం సందర్భంగా భక్తులు పోటెత్తారు. శ్రావణ సోమవారం మొదటి రోజు కావడంతో భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని శివలింగానికి అభిషేకాలునిర్వహించారు. ఆలయ అర్చకుడు నటరాజ శర్మ, మహేష్ శర్మలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

- పర్వతగిరి : శ్రావణమాసం సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. మండలకేంద్రంలోని పర్వతాల శివాలయంలో శివలింగాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.
- చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్ధేశ్వరాలయంలోని సిద్ధేశ్వరుడిని శ్రావణ మాసం మొదటి సోమవారం ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఆలయంలోని స్వామి వారికి ఆలయ అర్చకుడు భిక్షమయ్యశాస్త్రి అభిషేకపూజలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాంరెడ్డి, సంజీవరెడ్డి, విజయగోపాల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పెద్ది కృషితోనే మెడికల్ కళాశాల మంజూరు



ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఖానాపురం, ఆగస్టు 5 : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కృషితోనే నర్సంపేటకు మెడికల్ కళాశాల మంజూరైందని బీఆర్ ఎస్వీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్య దర్శి మాచర్ల శరత్‌చంద్ర, ఓడీసీ ఎంఎస్ చైర్మన్ గుగులోతు రామ స్వామినాయక్, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హయాంలో మంజూరై నిర్మాణం పూర్తయిన మెడికల్ కళాశాలలో తరగతు లకు అనుమతి ఉత్తర్వులు రావడంతో బీఆర్‌ఎస్వీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సోమ వారం మండల కేంద్రంలో జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి బీఆర్‌ఎస్ నాయకు లు ర్యాలీ నిర్వహించి టపాసులు పేల్చి, మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మీ వెంకటనర్సయ్య, మాజీ సర్పంచ్ కాస ప్రవీణ్‌కుమార్, బీఆర్‌ఎస్వీ నాయకులు సదరం వినయ్, దేవోజు హేమంత్, హజార్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సుధాకర్, యాకుబ్‌పాషా, యదగిరి, అశోక్, గంగపురం రమేష్ పాల్గొన్నారు.

డబ్ల్యూడీకేఏ చైర్మన్‌గా డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్



డాక్టర్ శ్రీనివాగౌడ్

నర్సంపేట టౌన్, ఆగస్టు 5 : వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ (డబ్ల్యూడీకేఏ) చైర్మన్‌గా నర్సంపేట పట్టణానికి చెందిన డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్‌ను ఎంపిక చేస్తూ తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, కె.జగదీశ్వర్‌యాదవ్‌లు ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలోని 13 మండలాల కబడ్డీ అసోసియేసన్ అధ్యక్ష, కార్యదర్శుల సమక్షంలో శ్రీనివాస్‌గౌడ్‌ను ఎంపిక చేశారు. 30సంవత్సరాల నుంచి శ్రీనివాస్‌గౌడ్ కబడ్డీ క్రీడాభివృద్ధికి, క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేస్తూ ఎన్నో కబడ్డీ టోర్నమెంట్స్ క్రీడా శిబిరాలను నిర్వహించినందుకు జిల్లా అసోసియేషన్ చైర్మన్‌గా నియమించారు. ఈ సందర్భంగా సోమవారం నర్సంపేటలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లా కబడ్డీ క్రీడాభివృద్ధికి మరింత కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా బాధ్యులు, మండలాల అధ్యక్ష, కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు.

- **మండల కబడ్డీ అసోసియేషన్ కమిటీ ఎంపిక**

దుగ్గొండి : మండల కబడ్డీ అసోసియేషన్ కమిటీని ఎంపిక చేసినట్లు అధ్యక్షుడు ఎల్లయ్య సోమవారం వెల్లడించారు. చైర్మన్‌గా పి.ఎల్లయ్య, అధ్యక్షుడిగా ఆర్.రాంరెడ్డి, ఉపాధ్యక్షులుగా రంగారెడ్డి, కుమారస్వామి, నర్సింహారెడ్డి. ప్రధాన కార్యదర్శిగా కక్కెర్ల మల్లికార్జున్, సంయుక్త కార్యదర్శులుగా ఉమమహేశ్‌రెడ్డి, ఎండీ. జమలోద్దీన్, కోశాధికారిగా డి.రమేశ్, సభ్యులుగా పి.సమ్మాలు, వీరారెడ్డి, వెంకటేశ్వర్లు, రాజయ్య ఎంపికయ్యారు.

కేరళ వరద బాధితులకు అండగా నిలవాలి

నర్సంపేట, ఆగస్టు 5 : కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులను ఆదుకోవడానికి ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని సీపీఎం జిల్లా నాయకుడు పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ కోరారు. వరద బాధితుల కోసం సోమవారం పట్టణంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ సంఘటనను కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సేకరించిన విరాళాలను సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గడ్డమీది బాలకృష్ణ, కందికొండరాజు, కలకోటి అనిల్, జగన్నాధం, కార్తీక్, దాసరి నరేశ్, పరీదా. వజ్జంతి, విజయ, స్వప్న, నాగమణి, ఇం ద్ర,లక్ష్మి, యాకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

గీసుగొండ, ఆగస్టు 5 : గ్రేటర్ పరిధిలోని 16వ డివిజన్ జాన్‌పాక వద్ద రెండు కిలోల ఎండు గంజాయిని పట్టుకొని ఒకరిని అరెస్టు చేసినట్టు సీఐ బాబులాల్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం సోమవారం జాన్‌పాక వద్ద మన్నా చర్చ్ ఎదురుగా వరంగల్-నర్సంపేట రహదారిపై పోలీసులు వాహనాలను తనిఖీలు చేపట్టారు. క్రమంలో మండలంలోని దస్రుతండాకు చెందిన కేలోతు రాకేష్‌చౌహాన్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా వెళ్తుండగా పట్టుకుని విచారించారు. దీంతో అతడి నుంచి రెండు కిలోల ఎండు గంజాయి లభించింది. గంజాయిని, వాహనాన్ని స్వాధీనం చేసుకొని రాకేషచౌహాన్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

గీసుగొండ, ఆగస్టు 5 : కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో గణేషా కంపెనీలో పనిచేస్తున్న మహిళ సోమవారం ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రం హండీ గ్రామానికి చెందిన కాజాదేవి(30), ఆమె భర్త రింకు కొద్ది నెలల క్రితం ఉపాధి కోసం టెక్స్‌టైల్‌పార్కుకు వచ్చారు. గణేషా కంపెనీలో భార్యాభర్తలు రోజువారి కూలీగా పనిచేస్తున్నారు. ఆరు నెలల క్రితం కుమారుడు అనారోగ్యంతో చనిపోవడంతో మనస్తాపం చెందిన కాజాదేవి గేటు వద్ద గల గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కల్తీ వరి గుళికల పట్టివేత



వరి గుళికల అమ్మకందారులను విచారిస్తున్న పోలీసులు

నల్లబెల్లి, ఆగస్టు 5 : మండలంలోని రుద్రగూడెంలో కొందరు వ్యక్తులు కల్తీ వరి గంట గుళికలను అమ్ముతుండగా గ్రామస్థులు పట్టుకుని సోమవారం పోలీసులకు అప్పగించారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోకి ముగ్గురు వరి గంట గుళికల విక్రయదారులు వచ్చి వరి పంట ఏపుగా రావడానికి గుళికలు పనిచే స్తాయంటూ బస్తా ఒక్కొక్కటి రూ.600ల చొప్పున 50 బ్యాగులు విక్రయించారు. అను మానించిన కొందరు గ్రామస్థులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు వచ్చి అమ్మకందారులను, వారి ఆటోను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గోరికొత్తపల్లికి చెందిన ఓ వ్యక్తి గుట్టు చప్పుడు కాకుండా ఈ దందా సాగిస్తున్నట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. కాగా, మండల వ్యవసాయ అధికారి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విక్రయదారుల వద్ద గుళికలను పరిశీలించి, విక్రయదారులపై ఫిర్యాదు చేయలేదు. పోలీసులను వివరణ కోరగా.. వ్యవసాయ అధికారులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని ఎస్సై ప్రశాంత్ బాబు తెలిపారు.

8న ధర్మ విజయ ప్రజాప్రదర్శన ర్యాలీ

నర్సంపేట టౌన్, ఆగస్టు 5 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు కృతజ్ఞతగా ఈ నెల 8న నర్సంపేట పట్టణంలో నిర్వహించనున్న ధర్మ విజయ ప్రజా ప్రదర్శన ర్యాలీలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కల్లెపెల్లి ప్రణయ్‌దీప్‌మాదిగ పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో చింతం సిద్ధు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు తడుగుల విజయ్, కట్ల రాజశేఖర్, శ్రీకాంత్, రవి, శ్రీనివాస్, సుధాకర్, సంతోష్, నరేష్ పాల్గొన్నారు.